సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం । 28 । జనవరి । 2025

గరిష్టం/కనిష్టం
32.2 /14.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 14.9 - 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.02 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.



దేవుని కడప ఆలయ వ్యూ - ఫొటో మహమ్మద్ రఫీ, సీనియర్ ఫొటో గ్రాఫర్

పుత్తా.. మనుషులం

అధికారమే పెట్టుబడిగా తెలుగుదేశం నేతలు తెగబడుతున్నారు. ఖాళీ జాగా కన్పిస్తే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. యంత్రాలతో చదును చేయడం.. ఆపై రెవెన్యూ అధికారుల సహకారంతో నకిలీ రికార్డులు పుట్టించడం చకచకా చేస్తున్నారు. ఎవరైనా ఎదురుతిరిగితే 'మేం ఎమ్మెల్యే పుత్తా మనుషులం' అంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

తెగబడుతున్న తమ్ముళ్లు

- ఎమ్మెల్యే పేరు చెప్పి కబ్జాకు దిగుతున్న అక్రమార్కులు
- రింగ్ రోడ్డులో ఖాళీ స్థలాన్ని చదును చేసిన వైనం
- ఆన్‌లైన్ రికార్డులు పుట్టించేపనిలో నిమగ్నం
- అడ్డగోలుగా సహకరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం



ఇందిరానగర్ సమీపంలో అటవీశాఖ బఫర్ జోన్ భూమి చదును చేసిన దృశ్యం



బీఎస్‌తండా నుంచి సాయిబాబానగర్ ఎస్టీకాలనీ వెళ్లే రహదారికి గ్రావెల్ తోలిచదును చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కడప: చింతకొమ్మదిన్నె పరిధిలో తెలుగుతమ్ముళ్లు నిత్యం కబ్జా చేయడమే పనిగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. తాజాగా మండల పరిధిలోని రింగు రోడ్డుపై వాలిపోయారు. ప్రధానంగా మామిళ్లపల్లె రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూములు రాత్రికి రాత్రే కబ్జాదారుల అన్యాక్రాంతమవున్నాయి.

మామిళ్లపల్లె రింగు రోడ్డు చుట్టూ పాడుబడ్డ రహదారులు, అటవీశాఖ బఫర్ జోన్, ప్రభుత్వ బంజరు భూములకు టక్కున హక్కులు వచ్చి పడుతున్నాయి. చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన ఓ మహిళ నేత, మరోనాయకుడు రెవెన్యూ అధికారులకు 'గంధం'పూస్తూ చాకచక్యంగా రికార్డులు పుట్టిస్తున్నారు. ఈక్రమంలో రాత్రికి రాత్రే కోట్లాదిరూపాయల ప్రభుత్వ భూములు అక్రమార్కుల పరమవుతున్నాయి. సర్వే నంబర్ 726లో అటవీశాఖ బఫర్ జోన్ భూమి ఉంది. ఆ భూమిని ఓ మహిళనేత చదును చేసి తమదేనంటూ తిష్టవేశారు. సర్వే నంబర్ 729, 731లో ప్రభుత్వ బంజరు భూమి మరో తెలుగుతమ్ముడు కబంధ హస్తాల్లోకి చేరింది. సర్వే నంబర్ 712లో 4.80 ఎకరాలు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది. ఆ భూమికి రికార్డులు పుట్టించి ప్రహరీ సైతం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే పేరు చెప్పి స్వాహాపరం...

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేరు చెప్పి ప్రభుత్వ భూములను తెలుగుతమ్ముళ్లు చెరబట్టారు. అటవీ బఫర్ జోన్ భూములనైనా వంక పరంబోకు భూమి అయినా పట్టాలు ఇవ్వడానికి నిరాకరించే గయ్యాలి పరంబోకు భూమి అయినా సరే కబ్జాలకు పాల్పడుతున్నారు. చదును చేసిన భూమికి రెవెన్యూ విభాగంలో చేయి తిరిగిన వారిచే నకిలీ డాక్యుమెంట్లు పుట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రింగు రోడ్డు దరిదాపుల్లో ఉన్న ప్రభుత్వ భూములు రాత్రికి రాత్రే అన్యాక్రాంతమవుతోన్నాయి. సెంటు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇందిరానగర్ పరిసర ప్రాంతాలల్లోని ప్రభుత్వ ఖాళీ భూములన్నీ తెలుగుతమ్ముళ్ల గుప్పిట్లోకి వెళ్లాయి. బీఎస్ తాండా నుంచి సాయిబాబానగర్ ఎస్టీకాలనీ వెళ్లే పాత రహదారి సైతం ఆక్రమించారు. గ్రావెల్ మట్టితో నింపి తర్వాత డోజర్‌తో చదును చేశారు. ఇలా చదును చేసిన ప్రభుత్వ భూములకు చింతకొమ్మదిన్నె రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారు. తెలుగుతమ్ముళ్ల పెత్తనానికి తలొగ్గి రెవెన్యూ యంత్రాంగం తప్పుడు రికార్డులకు అండగా నిలుస్తున్నట్లు సమాచారం. ఇలా ఎమ్మెల్యే పేరు వాడుకుంటూ కోట్లాది రూపాయాలు విలువైన భూములను పచ్చనేతలు సొంతం చేసుకుంటుండడం గమనార్హం.

- నేటి నుంచి దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలు
- 3న కల్యాణోత్సవం, 4న రథోత్సవం
- నేడు అంకురార్పణతో ప్రారంభం

కడప కల్చరల్ : తిరుమల తొలి గడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవానికి వేళయింది. ప్రసన్న వెంకటేశ్వరునిగా, కడప రాయుడిగా పూజలందుకుంటున్న ఆయన బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. మంగళవారం అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు ఫిబ్రవరి 7వ తేది వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ వారం రోజులపాటు ప్రతిరోజు ఓ అలంకారంలో తమ ఇష్టదైవాన్ని చూసుకోవాలని భక్తులు ఆశ పడతారు. మరీ ముఖ్యంగా కల్యాణోత్సవం నాడు కళ్లింతలుగా చేసుకుని స్వామి, అమ్మవార్లను మనసారా దర్శించుకుంటారు. రథోత్సవం నాడు స్వామి సాక్షాత్తు ఆకాశం నుంచే దర్శనమిస్తున్నాడని భావిస్తూ రథం పైనున్న స్వామికి రెండు చేతులెత్తి గోవిందనామ స్మరణలు చేస్తూ దర్శించుకుంటారు.

ఉత్సవ శోభ

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్నంతా కన్నుల పండువగా అలంకరించారు. రంగురంగుల ముగ్గులు తీర్చారు. ఆలయంతోపాటు దేవునికడప గ్రామమంతా విద్యుద్దీపాలను అలంకరించారు. ఇటు కృష్ణాసర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపుల సీరియల్ సెట్లు అలంకరించి ఆలయం నుంచి మైక్ సెట్లను ఏర్పాటు చేశారు. ఆలయంలో జరుగుతున్న పూజోత్సవాల గురించి వీటి ద్వారా నగర వాసులకు నేరుగా ప్రసారం అయ్యే అవకాశం కలిగించారు. అటు పాతకడప మీదుగా బైపాస్ రోడ్డు వద్ద భారీ ఆర్చిని నిర్మించారు. ఆ ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీ కటౌట్లు, విద్యుత్ దీప కటౌట్లతో అలంకరించారు. రోడ్లను కూడా వారం రోజులుగా మరమ్మతులు చేస్తున్నా..కొన్నిచోట్ల ఇంకా పనులు కొనసాగుతుండడం గమనార్హం.



విద్యుద్దీపాలంకరణలో అన్నమయ్య సర్కిల్

భక్తుల సౌకర్యం కోసం

ఈ ఏడాది దేవునికడప తిరునాలను టీటీడీ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. జేఈఓ వీరబ్రహ్మం ఇప్పటికే పలుమార్లు ఆలయంతోపాటు గ్రామాన్ని స్వయంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఉత్సవాలలో తిరుమల లడ్డూలను కూడా భక్తులకు అందుబాటులో ఉంచుతున్నారు. తేరును కూడా అందంగా ముస్తాబు చేసి రథోత్సవానికి సిద్ధం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు

తేది	ఉదయం	రాత్రి
28.01		అంకురార్పణ
29.01	ధ్వజారోహణం	చంద్రప్రభ వాహనం
30.01	సూర్యప్రభవాహనం	పెద్దశేష వాహనం
31.01	చిన్నశేష వాహనం	సింహ వాహనం
01.02	కల్పవృక్ష వాహనం	హనుమంత వాహనం
02.02	ముత్యపుపందిరి వాహనం	గరుడ వాహనం
03.02	కల్యాణోత్సవం	గజవాహనం
04.02	రథోత్సవం	ధూళి ఉత్సవం
05.02	సర్వభూపాల వాహనం	అశ్వ వాహనం
06.02	వసంతోత్సవం,చక్రస్నానం	హంసవాహనం ధ్వజావరోహణం
07.02		పుష్పయాగం (సాయంత్రం)

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ (డీటీసీ)గా మీరా ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన అన్నమయ్య జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ చంద్రశేఖర్‌రెడ్డి మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేపథ్యంలో ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి



ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి, వారి సమస్యను విన్నారు. అనంతరం వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కల్లు గీత కులాల మద్యం దుకాణాలకు ఫిబ్రవరి 5 లోపల దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 14 కల్లు గీత కులాలకు మద్యం దుకాణాలను కేటాయించిందన్నారు. అందులో కడప-ఈడిగ, ప్రొద్దుటూరు-ఈడిగ, మైదుకూరు- ఈడిగ, పులివెందుల-గౌడ్, బద్వేలు-ఈడిగ, వీఎన్‌పల్లె -గౌడ్, ప్రొద్దుటూరు రూరల్-ఈడిగ , పెద్దముడియం-గౌడ్, సికెదిన్నె -గౌడ, చక్రాయపేట- ఈడిగ, కాశినాయన-ఈడిగ, వేముల-గౌడ్, వల్లూరు, ఈడిగ, ఖాజీపేట -గౌడ్ కులాలకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో దరఖాస్తు రుసుము రూ. 2లక్షలుగా నిర్ణయించబడిందన్నారు. ఒక వ్యక్తి ఒక షాపునకు ఎన్ని దరఖాస్తులైనా చేయవచ్చన్నారు. దరఖాస్తుదారులు ఈ మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లైసెన్స్ ఫీజు 50 శాతంగా నిర్ణయించబడిందన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5తేదీ సాయంత్రం 5 లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్ సభాభవన్‌లో డ్రా జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తామన్నారు. కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ మేరాజ్



కడప మస్జిద్ ఏ నకాష్‌లో ప్రసంగిస్తున్న హజరత్ మహమ్మద్ అలీ బాగ్దాదీ

కడప కల్చరల్: జిల్లాలో పవిత్ర బడీరాత్‌ను (షబ్ ఏ మేరాజ్) ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి 8 తర్వాత ప్రార్థనలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా నమాజులు, గురువుల ప్రసంగాలతో రాత్రంతా ఆధ్యాత్మిక వాతావరణంలో నెలకొంది. మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలని వక్తలు ప్రసంగించారు. కడపలో ప్రతి మసీదులోనూ ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ సీ ఓబులమ్మ సోమవారం తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు అందించారు. కార్యాలయంలో ఉన్న పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణయ్యతో పాటు ఈపీఆర్డీఓ రహంతుల్లయ్య, ఏఈ త్రిమూర్తిరెడ్డిలు పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పని సరిగా పరిష్కరించాలన్నారు. తొలుత పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో ఓబులమ్మ పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు.

ప్రజల ఫిర్యాదుల్లో కొన్నింటి వివరాలిలా..

- చాపాడు మండలం చిన్నగురువలూరు గ్రామానికి చెందిన ఎం. అనిత వితంతు పెన్షన్ మంజూరు చేయసలని అభ్యర్థించారు.
- కడప పాలెంపల్లి గ్రామానికి చెందిన డి. లక్ష్మీ తనకు ప్రభుత్వం వారిచే ఇంటి స్థలం ఇప్పించాలని కోరారు.
- ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన కైప శ్రీధర్ తాము బ్రాహ్మణ కులానికి చెందిన వారమని, కర్మకాండములు జరుపుకొనుటకు 2 సెంట్ల స్థలం ఇవ్వవలసిందిగా విన్నవించారు.
- బద్వేలు మండల కేంద్రానికి చెందిన పి. చిన్న మౌలాలిబాషా అట్లూరు మండలంలోని కోట గ్రామంలో మిస్ అయిన తమ ఇళ్లను ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేసి రిపోర్ట్ ప్రకారం భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వవలసిందిగా కోరారు.
- అట్లూరు మండలం వరికుంటకు చెందిన బి. వెంకట రమణ తమ వ్యవసాయ భూములు సోమశీల ముంపుకు గురైనవని ప్రభుత్వం నుండి ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, ఎస్డీసి వెంకటపతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

రేపు సింహాద్రిపురానికి కలెక్టర్

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురానికి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ బుధవారం రానున్నట్లు ఎంఈఓ ఓబులేసు తెలిపారు. సింహాద్రిపురంలో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు న్యూ క్యాంపస్‌ను కలెక్టర్ ప్రారంభిస్తారని ఎంఈఓ వెల్లడించారు.

ఎరుపెక్కిన ఉద్యమం

- పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు జెండా దించం
- ఎన్నికల హామీలు విస్మరించిన బాబు
- కూటమి పాలనపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజం

కడప సెవెన్‌రోడ్స్ : కూటమి పాలనలో అడుగడుగునా ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమం ఊపందుకుంది. ఎక్కడికక్కడ నిరసన గళం మిన్నంటుతోంది. తాజాగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో కలెక్టరేట్'తో జిల్లా కేంద్రమైన కడప ఎరుపెక్కింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా ఏ ఒక్కరికీ ఇంతవరకు ఇంటి స్థలం కేటాయించిన పాపాన పోలేదని విమర్శించారు. పైగా ఎక్కడైనా పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే తొలగిస్తున్నారని మండిపడ్డారు. గతంలో కమ్యూనిస్టులు చేసిన పోరాటాల వల్ల ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ భూ సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. కానీ నేడు ఫ్రీ హోల్డ్ పేరిట పేదల భూములను పెద్దలకు అప్పగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఫ్రీ హోల్డ్ భూములను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ ఈరోజు కడపలో ప్రారంభించిన ఆందోళనలు ఫిబ్రవరి 10వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతాయన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను పట్టించుకోని ప్రభుత్వం పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం అడిగితే గతంలో ఇచ్చామంటున్నారని తెలిపారు. గతంలో ఇచ్చినప్పటికీ కుటుంబాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో అర్హులకు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యర్శి జి.చంద్ర మాట్లాడుతూ భూములు ఉంటే పేదల చేతిలో, లేదంటే ప్రభుత్వ ఆధీనంలో ఉండాలన్నారు. అంతే తప్ప ఫ్రీ హోల్డ్ పేరుతో ఇతరులకు కట్టబెట్టాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. సీపీఐ నాయకులు వెంకట శివ, ఎల్.నాగసుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా, మద్దిలేటి, జి.వేణుగోపాల్, రామయ్య, పోతిరెడ్డి భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన సీపీఐ శ్రేణులు , చిత్రంలో నేతలు రామకృష్ణ, ఈశ్వరయ్య తదితరులు

సీమ ప్రాజెక్టులపై దృష్టిపెట్టాలి

కొండాపురం : రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి గండికోటజలాశయాన్ని వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు పండక రాయలసీమలో సంక్రాంతి పండుగ వాతావరణం కూడా కనబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం పోలవరం అని పదే పదే చెప్పే సీఎం చంద్రబాబు సీమ ప్రాజెక్టులపై దృష్టిసారించకపోవడం విచారకరమన్నారు. ఇక్కడి ప్రాజెక్టులు పూర్తికి రాబోయేబడ్జెట్‌ల్లో రూ. 20 వేలకోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గండికోట ముంపు వాసుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పురావస్తు.. ఆంక్షలు మస్తు..

- సౌమ్యనాథాలయ అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు
- టీటీడీలోకి విలీనమైనా మారని పరిస్థితి

రాజంపేట : దక్షిణాది రాష్ట్రాల్లోని వైష్ణవ ఆలయాల్లో అతిపెద్దది చోళుల కాలం నాటి సౌమ్యనాథాలయం, ఇప్పుడు ఈ గుడి అభివృద్ధికి కేంద్ర పురావస్తుశాఖ గ్రహణం పట్టుకుంది. ఇది భక్తుల మనోగతం. అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రతిశనివారంతోపాటు నిత్యం భక్తుల రాక అధికంగా వస్తున్నా అరకొరసౌకర్యాలు ఆలయంలో ప్రత్యక్షంగా కనిపిస్తాయి. టీటీడీ ఏదీ చేపట్టాలన్న కేంద్రపురావస్తుశాఖ ఆంక్షలతో వెనకడుగు వేస్తున్నారు. కల్యాణవేదిక, పరిపాలనగదులు, పోటు, సిబ్బంది గదులు కూడా నిర్మించడానికి అభ్యంతరాలు పుట్టుకొచ్చాయి. దీంతో రేకులషెడ్డ్ నిర్మితం చేసుకున్నారు. ఆలయం అభివృద్ధి విషయంలో కేంద్రపురావస్తుశాఖ నైజం బహిర్గతమవుతోందని భక్తులు పెదవి విరిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022లో సౌమ్యనాథాలయం టీటీడీలో విలీనమైంది. ఇకపై ఆలయ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్న భక్తుల ఆశలు అడియాశలయ్యాయి. కేంద్రపురావస్తుశాఖ అభ్యంతరాలు, ఆక్షేపణలే దీనికి కారణంగా నిలుస్తున్నాయి. ఇప్పుడు టీటీడీ కేవలం దేవుని కైంకర్యాలు, దర్శనాలు, పూజలు మాత్రం చూసుకుంటోంది. ఆలయం చుట్టూ ఉన్న ప్రహరీగోడ శిథిలావస్థకు చేరుకుంది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలతో మిళితమైన ప్రహరీగోడ పై భాగం కూలిపోయినా ఇంతవరకు పునర్నిర్మించలేదు. కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రాచీన గోడ నిర్మాణం ప్రశ్నార్థకమే...

సౌమ్యనాథాలయం ప్రాచీన గోడ 2023లో వైకుంఠఏకాదశి ముందురోజున కూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గోడపునర్నిర్మాణం మరిచారు. గతంలో ఇదే అంశంపై జిల్లా కేంద్రపురావస్తుశాఖ అధికారిని వివరణ కోరగా టెండర్లను పిలిచామన్నారు. నేటి వరకు పనులు జరగలేదు. రాళ్లు, రప్పలతో ఆలయంలో అలాగే ఉండిపోయింది.





సౌమ్యనాథాలయం, ఆలయంలోని ఉత్తరగాలిగోపురం దగ్గర కూలిపోయిన ప్రాచీన ప్రహరీగోడ

చెత్త చెదారంతో నిండిన ప్రాంగణం

సౌమ్యనాథాలయం ప్రాంగణం విశాలమైనది. ఇప్పుడు ఇంది చెత్తచెదారాలతో నిండిపోయింది. పాములు కూడా సంచరిస్తున్నాయి. దీంతో భక్తులు భయపడుతున్నారు. ఆలయం వెనుకవైపు, కాళ్లు,చేతులు శుభ్రం చేసుకునే కుళాయి వద్ద శుభ్రత లేదని, అయినా కేంద్రపురావస్తుశాఖ పట్టించుకోవడంలేదన్న భక్తులు ఆరోపిస్తున్నారు.బ్రాహ్మణవీధిలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగాగా తయారైంది. నలుమూలల నుంచి ఆలయానికి వచ్చే భక్తులు ఆర్కియాలజీ తీరుపై పెదవి విరిస్తున్నారు.

ఉల్లంఘేశ్వరుని ఆలయంకు అడ్డుగా రథం

చోళుల కాలం నాటి ఉల్లంఘేశ్వరుని ఆలయానికి అడ్డుగా సౌమ్యనాథుని రథం ఉందని ఆలయ నిర్వాహకులు వాపోతున్నారు. ఆర్కియాలజీ వారికి స్థలం ఉందని, అక్కడ అభివృద్ధిచేసి రథాన్ని భద్రపరచుకోవాలని స్థానికులు అంటున్నారు. ఆ దిశగా కేంద్రపురావస్తుశాఖ చర్యలు కనిపించడంలేదు.

దక్షిణగాలిగోపురం కట్టలేని దుస్థితి..

దశాబ్దాలుగా ఆలయ దక్షిణగాలిగోపురం నిర్మితం చేపట్టలేని దుస్థితిలో కేంద్రపురావస్తుశాఖ ఉంది. కేవలం ఆధారాలు లేవన్న కారణంతో నిర్మాణం చేపట్టడం లేదు. గతంలో కేంద్రపురావస్తుశాఖ ఢిల్లీ స్థాయి ఉన్నతాధికారి వీరభద్రరావు వచ్చినప్పుడు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రాంతం ఎంపీలు కూడా దక్షిణగాలిగోపురం నిర్మించాలని గతంలో కేంద్రపురావస్తుశాఖను కోరారు.

అధ్వానంగా ఆలయ ప్రాంగణం



కేంద్రపురావస్తుశాఖ నిర్లక్ష్యం ఆలయ నిర్వహణలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆలయ ప్రాంగణం అధ్వానంగా తయారైంది. ప్రహరీని బాగుచేయలేదు. ఉల్లంఘేశ్వరాలయానికి అడ్డంగా రథం పెట్టారు. ఆర్కియాలజి స్థలంలో పెట్టుకుంటే ఆలయం కనిపిస్తుంది. టీటీడీలోకి విలీనమైనా ఆలయ పరిస్థితి మారలేదు.

- అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, మాజీ ఛైర్మన్, సౌమ్యనాథాలయం,

కొరవడిన సమన్వయం



కేంద్ర పురావస్తుశాఖ, టీటీడీ మధ్య సమన్వయం కొరవడింది. ఆలయం బాగోగులు అంతంతమాత్రమే. రెండేళ్ల క్రితం పడిపోయిన ప్రహరీని ఇంతవరకు నిర్మించలేదు.నిత్యం భక్తులు వస్తున్నారు. వారి సౌకర్యాల కల్పనకు ఆర్కియాలజీ ఆంక్షలు అడ్డుగోడలుగా నిలిచాయి. ఇరుశాఖలు అవగాహనతో ఆలయం అభివృద్ధి చేయాలి

- సోమిశెట్టి ప్రభాకర్, స్థానికనేత, నందలూరు గ్రామం

క్లుప్తంగా

అక్రమ మద్యం పట్టివేత

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : డిఫెన్స్ (మిలిటరీ) అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని పక్కీరుపల్లిలో డిఫెన్స్ మద్యం అక్రమంగా అమ్ముతుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దండ్ల శివయ్య, బొల్ల బాలకృష్ణను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దాదాపు 80 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. వీటి విలువ రూ.2,65 లక్షలు ఉంటుంది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నరసింహారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్క్వాడ్ సిబ్బంది చంద్రశేఖర్, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో గుర్తు తెలియని మృతదేహం



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరంలోని గంగమ్మ ఆలయ సమీపంలో ఉన్న పెన్నానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం రూరల్ పోలీసులు గుర్తించారు. అతనికి సుమారు 50–55 ఏళ్లు ఉంటాయని రూరల్ పోలీసులు తెలిపారు. తెలుపు, పచ్చరంగు చెక్స్ కలిగిన షర్టు, డ్రాయరు ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

తాగునీరు కలుషితం

సిద్దవటం : మండల పరిధి మాధవరం 1, 2, 3 వార్డుల్లోని ఆర్‌ఓ ప్లాంటు నీరు కలుషితంగా ఉన్నాయని గ్రామస్తులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వం తాగునీటి కోసం ఇక్కడ ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేసింది. కొన్ని రోజుల నుంచి ఆ నీటిలో మురుగు, పురుగులు వస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

బూడిద కోసం బరితెగింపు

ఆర్టీపీపీ నుంచి వస్తున్న ఫ్లైయాష్ (బూడిద) అధికార పార్టీ నేతలకు కల్పతరువుగా మారింది. దీని కోసం ఇటీవల తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య వివాదం తలెత్తి సీఎం చంద్రబాబు వద్ద పంచాయితీ జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు బూడిద లోడింగ్ , రవాణా విషయంలో స్థానిక కూటమి వర్గీయుల మధ్య గొడవ జరిగింది.

- ఆర్టీపీపీ ఫ్లైయాష్ కోసం రగడ
- కూటమి వర్గీయుల మధ్య ఘర్షణ
- కర్రలతో దాడి
- పరస్పరం ఫిర్యాదులు



సంజీవరెడ్డి వర్గీయులపై కర్రతో దాడి చేస్తున్న ప్రత్యర్థులు



మీడియాతో మాట్లాడుతున్న సంజీవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధి డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లోని ఫ్లైయాష్ పౌడర్ కోసం కూటమి వర్గీయులు పోటీ పడుతున్నారు. దీన్ని అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు బరి తెగిస్తున్నారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. సోమవారం ఒక వర్గంపై మరో వర్గం వారు కర్రలతో దాడికి దిగారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలమల్ల గ్రామ పరిధిలోని ఆర్టీపీపీ సమీపంలో ఫ్లైయాష్ పౌడర్ పాండ్ ఉంది. ఆర్టీపీపీలోని యూనిట్ల నుంచి వస్తున్న ఫ్లైయాష్ పౌడర్ నీటిని సమీపంలో ఉన్న ఈ పాండ్‌కు పెద్ద పైపులైన్ ద్వారా తరలిస్తుంటారు. పైపులైన్ ద్వారా వస్తున్న ఫ్లైయాష్ నీరు చల్లారిన తర్వాత పౌడర్(బూడిద)గా మారిపోతుంది.

నీటిని మళ్లించుకునే విషయంలో..

ఈ పాండ్‌లో జేసీబీలు, ఇటాచ్‌లు పెట్టుకుని సంజీవరెడ్డి, ఆయన సోదరుడు విద్యాసాగర్‌రెడ్డి, అల్లుడు నా రాయణరెడ్డి టిప్పర్ల ద్వారా ఫ్లైయాష్‌ను లోడ్ చేసుకుంటున్నారు. అలాగే కొండాపురం మండలం చౌటిపల్లికి చెందిన రామ్మోహన్‌రెడ్డి కూడా పాండ్‌లో ఒక పక్క జేసీబీ పెట్టుకుని బూడిదను టిప్పర్ల ద్వారా లోడ్ చేసుకుంటూ సొమ్ములు తీసుకుంటున్నారు. ఈ పాండ్‌కు ఆర్టీపీపీ నుంచి వస్తున్న పైపులైన్ ఉంది. ఈ పైపులైన్ ద్వారా వస్తున్న బూడిద నీరే ఈ రగడకు కారణమైంది.

ఈ నీటిని ఇరువురు తమకు అనుకూలంగా మళ్లించుకోవడంలో వాదన జరిగింది. ఆదివారం రామ్మోహన్‌రెడ్డి తనకు అనుకులంగా పైపులైన్‌ను తిప్పుకొన్నారు. దీన్ని గమనించిన సంజీవరెడ్డి సోదరుడు విద్యాసాగర్‌రెడ్డి పైపులైన్‌ను తమకు అనుకులంగా తిప్పుకొన్నారు. ఇది ఇరువురి మధ్య గొడవకు దారి తీసింది. ప్రధానంగా ఫ్లైయాష్ బూడిదను టిప్పర్లు, లారీలకు లోడ్ చేయడంలో పెద్ద మొత్తంగా ఆదాయం వస్తుంది. దీని కోసమే సంజీవరెడ్డి, రామ్మోహన్‌రెడ్డిల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఈ బూడిద లోడును పాండ్‌లో ఇరువురు వేర్వేరు చోట పెట్టుకున్నారు. ఫ్లైయాష్ నీరు రాకపోతే బూడిద ఉండదు. అప్పుడు వారికి వచ్చే ఆదాయం తగ్గిపోతుంది. దీంతో ఇరువురూ బూడిద నీటి కోసం పోటీ పడ్డారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలోనే..

కలమల్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో మైలవరం దక్షిణ కాలువ వద్ద సంజీవరెడ్డి ఉండగా.. అక్కడికి రామ్మోహన్‌రెడ్డి వచ్చారు. ఇద్దరూ వాదనకు దిగారు. వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. రామ్మోహన్‌రెడ్డితోపాటు ఆయన వర్గీయులు కర్రలు తీసుకుని సంజీవరెడ్డిపైన ఇష్టారాజ్యంగా దాడి చేసి గాయపరిచారు. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చి, వారిని పంపించి వేశారు. ఆ వెంటనే పాండ్ వద్దకు రామ్మోహన్‌రెడ్డి తన అనుచరులతో వెళ్లి.. అక్కడ ఉన్న విద్యాసాగర్‌రెడ్డిపై కర్రలతో దాడి చేశారు. పాండ్ వద్ద ఎస్‌ఐ ఉండగానే వారందరూ విద్యాసాగర్‌రెడ్డిపై కర్రలతో దాడి చేయడం గమనార్హం. పోలీసులు జోక్యం చేసుకుని చెదరగొట్టారు. సంజీవరెడ్డి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి.. రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి వర్గానికి చెందిన వారు కావడంతో విషయం చర్చనీయాంశమైంది.

కలమల్లకు చేరుకున్న పోలీసు బలగాలు

ఈ విషయం తెలుసుకున్న వెంటనే ప్రత్యేక పోలీసు బలగాలు కలమల్లకు చేరుకున్నాయి. కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబుతో పాటు ఎస్‌ఐలు అక్కడికి వచ్చారు. ఇరు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని కలమల్ల ఎస్‌ఐ తిమోతి తెలిపారు.

కూల్చివేతను అడ్డుకున్న భక్తులు

కాశినాయన ఆలయ కట్టడాల తొలగింపునకు యత్నం



కూల్చివేతను అడ్డుకుంటున్న గ్రామస్తులు, భక్తులు

కాశినాయన : మండల పరిధి జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆలయానికి అటవీ శాఖ అనుమతులు లేవు. దీనిపై ఆశ్రమ నిర్వాహకులు కేంద్ర అటవీ శాఖ మంత్రిని కలిసి ఫారెస్టు అనుమతులు ఇవ్వాలని విన్నవించుకున్నారు. అయితే అనుమతులు లేని కట్టడాలను కూల్చివేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని ఫారెస్టు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే సోమవారం కట్టడాలను కూల్చి వేసేందుకు జేసీబీతో ఫారెస్టు అధికారులు పోలీసు బందోబస్తుతో ఆశ్రమానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, భక్తులు కూల్చివేతను అడ్డుకోవడంతో ఫారెస్టు అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

- టీడీపీలో రెండు వర్గాలు పోటీ
- 10 ఎకరాల్లో కంప చెట్ల తొలగింపు



పలుగురాళ్లపల్లెలో టీడీపీ నాయకులు జేసీబీతో కంప చెట్లు తొలగించిన ప్రభుత్వ భూమి

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సొంత మండలం బ్రహ్మంగారిమఠంలోని పలుగురాళ్లపల్లె రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 2229లో 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. టి.చౌదరవారిపల్లె నుంచి బి.కోడూరు వెళ్లే దారి, గొడ్లవీడు నుంచి టి.చౌదరవారిపల్లెకు వెళ్లే దారిలో కొండ మోటు భైరవస్వామి గుడి సమీపంలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోని సర్వే నంబర్ 2229లో 10 ఎకరాల కోసం గొడ్లవీడు, చౌదరవారిపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు పోటీ పడుతున్నారు. రెండు వర్గాలకు చెందిన నాయకులు ఒకే పార్టీ వారు అయినా.. వెనక్కి తగ్గకుండా ఘర్షణకు కూడా దిగినట్లు తెలుస్తోంది. గొడ్లవీడుకు చెందిన జయరామిరెడ్డి, చౌదరవారిపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి మద్దతుతో రెండు గ్రామాలకు చెందిన దాదాపు ఏడుగురు 10 ఎకరాలపై కన్ను వేశారు. ఇప్పటికే గొడ్లవీడు గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు బోరు కూడా వేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు ఎక్కడా ఆక్రమణకు గురికాకుండా అప్పటి ప్రజాప్రతినిధులు కాపాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే రెండు గ్రామాల నాయకులు ప్రభుత్వ భూములపై కన్ను వేశారు. ఇప్పటికే బి.మఠం మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి.

తహసీల్దార్ ఏమంటున్నారంటే..

పలుగురాళ్లపల్లె గ్రామ సర్వే నంబర్ 2229లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో జేసీబీతో చెట్లు తొలగిస్తున్నట్లు సమాచారం రావడంతో వీఆర్‌ఓను పంపడం జరిగింది. అక్కడ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ భూములు ఎలాంటి ఆధారాలు లేకుండా ఎవరైనా ఆక్రమణలు చేస్తే వారు ఎంతిటి వారైనా చర్యలు తీసుకుంటాం. ఇందుకు కలెక్టర్, ఎమ్మెల్యే కూడా పూర్తిగా హామీ ఇచ్చారు.

ఎలక్ట్రికల్ కార్మికులకు అండగా ఉంటాం

మేయర్ సురేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : ఎలక్ట్రికల్ కార్మికులకు అండగా ఉంటామని మేయర్ సురేష్ బాబు అన్నారు. సోమవారం జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవం సందర్భంగా స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ సిటీ అభివృద్ధి కావాలన్నా ఎలక్ట్రికల్ కార్మికుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. ప్రమాద బీమా పథకం ఎవరికీ అందడం లేదని, అందరికీ వచ్చేటట్లు కృషి చేస్తామన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ కార్మికులు ఎక్కువ కాలం మన్నిక వచ్చే నాణ్యమైన పరికరాలు వాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా పథకానికి నమోదు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వచ్చినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేసన్ జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమం కోసం తమ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఆ తర్వాత లక్కీ డ్రా తీసి విజేతలుగా నిలిచిన కార్మికులకు సుమారు లక్ష రూపాయలు విలువ గల బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు నరేంద్ర, కుమార్ (చిట్టీ), రాష్ట్ర ఈసీ మెంబర్ మైనంమల్లి, నాయకులు షరీఫ్, గోపాల్, శివారెడ్డి, చిన్న కృష్ణ, హమీద్, ప్రసాద్, ఆలస్టాల్ డీలర్ నరసింహులు, నవజీవన్ రెడ్డి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సన్నపల్లెలో భారీ చోరీ

- రూ.12 లక్షల ఆభరణాలు, నగదు అపహరణ
- మరొక ఇంటిలో చోరీ విఫలం



బీరువా నుంచి చిందర వందరగా పడిన వస్తువులు

ఖాజీపేట : ఇంటిలో తాపీగా కాఫీ తాగి, సుమారు 12 లక్షల విలువ గల బంగారం వస్తువులను చోరీ చేసిన సంఘటన ఖాజీపేట మండలంలో సంచలనం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలం సన్నపల్లె గ్రామంలో తుమ్మలూరు రవీంద్రారెడ్డి, సోముల కొండారెడ్డి ఇళ్లలో సోమవారం తెల్లవారుజామున చోరీ యత్నం జరిగింది. సోముల కొండారెడ్డి ఇంటిలో ఎవరూ లేక పోవడం, అందరూ బెంగళూరులో ఉండటంతో దొంగలు మొదటి కటాంజనం గ్రిల్ పగుల కొట్టి లోపలికి వెళ్లారు. రెండవ వాకిలి సెంట్రల్ లాక్ ఉండటంతో తీసేందుకు ప్రయత్నించారు. రాక పోవడంతో వదిలి కొద్ది దూరంలో ఉన్న తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో చోరీ యత్నం చేశారు. ఇంటి ముందు వాకిలి పగులగొట్టి లోనికి వెళ్లారు. బీరువా పైన ఉన్న కీ తీసుకుని లోపల ఉన్న 13 తులాల బంగారం, నగదు రూ.1,50,000 తోపాటు 5 వేల విలువ గల వెండి నగలను చోరీ చేశారు. మొత్తం వాటి విలువ రూ.12 లక్షలు ఉంటుంది. ఫ్రిజ్‌లో ఉన్న పాలను తీసుకుని కాఫీ చేసుకుని తాగి అక్కడే పెట్టి వెళ్లిపోవడం గమనార్హం. తుమ్మలూరు రవీంద్రారెడ్డి తన ఇంటి మేడపై ఉన్న మిద్దెపై రాత్రి బస చేశారు. ఉదయం కిందికి వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

క్లూస్ టీం పరిశీలన

చోరీ జరిగినట్లు గుర్తించిన తరువాత ఎవ్వరూ ఇంటిలోకి వెళ్లక పోవడం వల్ల ఖాజీపేట సీఐ మోహన్ క్లూస్ టీం తీసుకు వచ్చి వేలిముద్రలను గుర్తించే యత్నం చేశారు. చోరీ ఎలా జరిగిందని బాధితుల ద్వారా తెలుసుకుని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రసవత్తరంగా ఆంధ్రా, పంజాబ్ మ్యాచ్



ప్రసాద్, ఆంధ్రా (68 పరుగులు)

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్–23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. మూడో రోజు సోమవారం 85 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 62.1 ఓవర్లలో 162 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఎస్.డి.ఎన్.వి. ప్రసాద్ 68, వాసు 36 పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లు ఆయుష్ గోయల్ 6, క్రిష్ భగత్ 3 వికెట్లు తీశారు. దీంతో 255 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పంజాబ్ జట్టు 43 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. జట్టులోని జష్‌కరణ్‌సింగ్‌పాల్ 56, ఉదయ్‌శరణ్ 57 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. కాగా 140 పరుగుల విజయలక్ష్యం పంజాబ్ ముందుంది.

ప్రైవేటు బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు



గాయపడిన వారిని 108 వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

11 మందికి గాయాలు

దువ్వూరు(చాపాడు) : కర్నూలు – కడప జాతీయ రహదారిలోని దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. చిత్తూరుకు చెందిన 30 మంది జగన్ ట్రావెల్స్ బస్సును బాడుగకు మాట్లాడుకుని కాశీయాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం తెల్లవారుజామున గుడిపాడు సమీపంలో డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో బస్సు ఎడమ పక్కన రోడ్డు దాటుకుని పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 11 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రులకు 108 వాహనంలో తరలించారు. 30 మందితో ప్రయాణిస్తున్న బస్సు బోల్తా పడిన సమయంలో ఎదురుగా, వెనకాల నుంచి ఎలాంటి వాహనాలు రాకపోడంతో ఘోర రోడ్డు ప్రమాదమే తప్పినట్లయిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వినోద్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి నేతల దోపిడీ

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : కూటమి నేతలు రాష్ట్రాన్ని దోచుకుంటూ డైనోసార్లుగా తయారయ్యారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.కొంతమంది నాయకులు అధికారం ఎక్కడ ఉంటుందో అక్కడికి పార్టీలు మారుతుంటారని.. అలాంటి వ్యక్తుల్లో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఒకరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీ, ఆ తర్వాత టీడీపీ, ఆపై బీజేపీ.. ఇలా పార్టీలు మారుతూ ఊసరవెల్లిలా మారారని వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తికి వైఎస్సార్‌సీపీని విమర్శించే నైతిక హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఆదినారాయణరెడ్డి కుటుంబానికి రాజకీయ భిక్షపెట్టిందే వైఎస్ కుటుంబమని.. అలాంటిది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే విమర్శించే హక్కు ఆయనకు లేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో ఉండదని చెబుతున్న నీకు నిజంగా ధైర్యం ఉంటే రాజీనామా చేసి ఎన్నికలు రావాలని ఆదినారాయణ రెడ్డికి సవాల్ విసిరారు. ఏడు నెలల ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేక ఘోరంగా విఫలమైందన్నారు. శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. మంచి ప్రభుత్వం అంటే పేకాట క్లబ్బులు పెట్టి నెలకు రెండు లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేయడమా, మట్టి, ఇసుకదందాతో పాటు వ్యాపారుల నుంచి ఆర్టీపీపీలో ఫ్లయాస్‌లపై కమిషన్లు తీసుకోవడమా అని తూర్పారబట్టారు. చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు తెస్తామని చెప్పిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసేలా ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.మోహన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూలవంక పాత బ్రిడ్జి తొలగింపు



బ్రిడ్జికి అవతలి వైపున ఉన్న మూలవంక గ్రామ శ్మశాన వాటిక



రిపబ్లిక్ డే రాత్రి సమయంలో బ్రిడ్జిపై అడ్డుగా కట్టిన గోడలు



సోమవారం హిటాచిలతో పక్కకు తొలగించి వంపు చేసిన ఇనుప గడ్డర్లు



హిటాచిలతో పనులు చేసిన కారణంగా బ్రిడ్జి కింది దుస్థితి

వివాదాస్పదంగా మారిన వైనం

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారికి సంబంధించి చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని మూలవంక గ్రామం నుంచి బుగ్గలేటిపల్లి మధ్యలో పాత జాతీయ రహదారిపై ఉన్న పాత బ్రిడ్జి తొలగింపు ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ఈ వంతెన నిర్మాణం జరిగి వంద సంవత్సరాలు పూర్తి అయినందున, నిపుణుల నివేదికల ఆధారంగా.. దెబ్బతిన్న భాగాన్ని సోమవారం తెల్లవారుజామున జాతీయ రహదారుల అధికారుల నేతృత్వంలో పోలీస్ పహారాలో బ్రిడ్జి కింది భాగాన కొన్ని ఇనుప గడ్డర్లను పక్కకి తొలగించినట్లుగా నేషనల్ హైవే ఈఈ విజయభాస్కరరెడ్డి తెలిపారు. అదే నిజమైతే బ్రిడ్జిని పగటిపూట తొలగించడానికి అవకాశం ఉన్నప్పటికీ.. రాత్రికి రాత్రే తొలగింపు చర్యలు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. అది కూడా రిపబ్లిక్ డే రోజైన ఆదివారం రాత్రి సమయంలో.. బ్రిడ్జిపై అడ్డుగా గోడలు కట్టి రోడ్డును మూసివేయడం ద్వారా రాకపోకలను పూర్తిగా నిలిపివేయడం ప్రజల్లో మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. దానికి తోడు సోమవారం తెల్లవారుజామున నేషనల్ హైవే అధికారుల నేతృత్వంలో బ్రిడ్జి కింది భాగంలో కొంత భాగాన్ని హిటాచిలతో తొలగించడం విమర్శలకు తావిస్తోంది. బ్రిడ్జి పై భాగంలో అడ్డుగా గోడ కట్టి రాకపోకలను పూర్తిగా నిలిపివేసిన అధికారులు కింది భాగాన్ని రాత్రికి రాత్రి ఎందుకు తొలగించాల్సింది వచ్చిందోనని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు బాగున్న బ్రిడ్జి ద్వారా రాకపోకలను నిలిపివేయడమే ధ్యేయంగా.. గోడలు కట్టి రాకపోకలను నిలిపి వేశారని, ఎవరైనా పరిశీలిస్తే బాగున్న బ్రిడ్జిపై రాకపోకలను అడ్డుకోవడంపై విమర్శలు తప్పవని భావించిన అధికారులు.. దాన్ని కప్పిపుచ్చుకోవడానికే రాత్రికి రాత్రి బ్రిడ్జి కింది భాగంలో కొంత మేర తొలగించి బ్రిడ్జి దెబ్బతిన్నట్లు చూపే ప్రయత్నం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉదయం చూడటానికి వచ్చిన కొందరు నాయకులు, స్థానిక ప్రజలు బ్రిడ్జి కింది గోడను, గడ్డర్లను, పిల్లర్ల వద్ద హిటాచీలతో లాగినట్లు స్పష్టంగా కనిపిస్తుండటంతో.. కావాలనే కూల్చే ప్రయత్నాలు చేస్తున్నారని అనుమానిస్తున్నారు. బ్రిడ్జిపై గోడలు కట్టి మూసివేసిన కారణంగా మూలవంక ప్రజలు 1.5 కిలోమీటర్ల దూరం తిరుక్కొని మూలవంక గ్రామ శ్మశాన వాటిక వద్దకు వెళ్లాల్సిన పరిస్థితిని కల్పించారు.